క్లుప్తంగా

నాణ్యమైన విద్య అందించాలి

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ముందుండాలని జిల్లా విద్యాధికారి ఇ.సోమశేఖరశర్మ అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డైరీ, క్యాలెండర్లను కొత్తగూడెంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు సర్వీస్‌తో పాటుగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.మాధవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రకాశరావు, జిల్లా ట్రెజరర్ బి.బాలాజీ, రాష్ట్ర కౌన్సిలర్ బి.జుంకీలాల్, ప్రధానోపాధ్యాయులు టీవీఆర్ఎన్.స్వామి, బి.శారద, నాగేశ్వరరావు, ఎంఈఓ రామ్‌సింగ్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు అధికారం దక్కాలి

పాల్వంచ: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు తీసుకుంది బీసీ, ఎస్టీ, ఎస్సీలైతే అగ్రకులాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఎలుతున్నారని దళిత్ శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర శుక్రవారం పాల్వంచ చేరుకుంది. ఈ సందర్భంగా ఇందిరా కాలనీలో శిలాఫలకం, జెండా దిమ్మను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. తెలంగాణలో సబ్బండ కులాల వాటా ఎంతని ప్రశ్నించారు. నూటికి 90శాతం ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీలే రాష్ట్రాన్ని పాలించాలన్నారు. అట్టడుగు వర్గాలను అధికారంలోకి తీసుకొచ్చే వరకు తమ పోరాటం ఆగదన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో మార్చి 15న ప్రారంభమైన స్వరాజ్య పాదయాత్ర ఏడువేల కిలోమీటర్లు సాగిందని, ఇరవై అయిదు జిల్లాల్లో కాలినడకన పూర్తి చేసుకుని 26వ జిల్లాగా భద్రాద్రి కొత్తగూడెంలో అడుగుపెట్టడం జరిగిందన్నారు. అణగారిన వర్గాల రాజ్యం వస్తే ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, మధుసూదన్, రాంబాబు, స్వామి, వెంకట్, శివ, సంజీవన్, రమేష్ పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో నాన్ టీచింగ్ అండ్ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ అనుబంధ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్ఓ అశోకచక్రవర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కేజీబీవీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల రమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా 30 శాతం పీఆర్‌సీ అమలు చేయకుండా కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 30 శాతం పీఆర్‌సీ అమలు చేసి కార్మికుల వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.సతీష్, సుహాసిని, రమణ, అరుణ, సమ్మక్క, భారతి, వెంకటరమణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బహిరంగసభను విజయవంతం చేద్దాం

ఇల్లెందురూరల్: ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని రైతు బంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ల మాధవరావు పిలుపునిచ్చారు. పోలారం గ్రామంలో శుక్రవారం గ్రామపంచాయతీ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా టీఆర్ఎస్‌ను స్థాపించి లక్ష్యాన్ని చేరుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనిమిదేళ్లలోనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేస్తున్నట్లు చెప్పారు. డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, మంచె రమేష్, దేవులానాయక్, శ్రీనివాస్, రాందాస్, సుధాకర్, మల్సూర్, కవిత, లక్ష్మయ్య పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని కేటీపీఎస్ సీఈ ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక 5,6 దశల ఆధ్వర్యంలో కేఎస్‌పీ క్యాంప్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్ట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఈలు జీవీ.ధర్మారావు, పి.కృష్ణ, టి.సత్యనారాయణ, బి.మోక్షవీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.వీరస్వామి, వెల్ఫేర్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్, డీఈ భాగం రాధాకృష్ణ పాల్గొన్నారు.

పదపదవే గాలిపటమా..!

- సంక్రాంతి పండుగ సంబురం
- గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నాపెద్దలు
- మార్కెట్‌లో పండుగ సందడి



కొత్తగూడెం పెద్దబజార్‌లో పతంగులతో యువకులు

కొత్తగూడెంటౌన్: పల్లె, పట్టణాల్లో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. ప్రజలు ఈనెల 14వ తేదీన బోగి, 15న మకర సంక్రాంతి, 16న కనుమ జరుపుకోనున్నారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే నెల రోజుల ముందు నుంచే గాలి పటాలను ఎగురవేస్తూ చిన్నాపెద్ద సంబురాలు జరుపుకుంటారు. మిద్దెలు ఎక్కి, మైదానం లాంటి ప్రాంతాలకు చేరుకుని గాలిపటాలను ఎగురవేస్తూ ఆనందంతో కేరింతలు కొడుతూ సంక్రాంతి పండుగను జరుపుకుంటారు. ఈ ఏడాది రకరకాల గాలి పటాలు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. జిల్లా కేంద్రంలో పతంగుల అమ్మకాల జోరుతో రామవరం, కొత్తగూడెం, గణేష్‌టెంపుల్, సూపర్‌బజార్, పాత కొత్తగూడెం, శ్రీఇంక్‌లైన్, విద్యానగర్ కాలనీ,



రామవరంలో పతంగులు ఎగురవేస్తున్న యువకులు



గాలిపటాల షాపులో చిన్నారుల సందడి

రుద్రంపూర్, గౌతంపూర్, నేతాజీ మార్కెట్, చిన్న బజార్‌లో ప్రజలు గాలి పటాలను ఎగురవేస్తూ సంబురాలు జరుపుకుంటున్నారు.

మార్కెట్‌లో పలు రకాల పతంగులు...

సంక్రాంతికి పతంగులు ప్రత్యేకం కాబట్టి వీటికి గిరాకీ ఉందని వ్యాపారులు అంటున్నారు. నేడు పండుగ మొదటిరోజు కావడంతో గురు, శుక్ర వారాల్లో పతంగుల అమ్మకాలు జోరుగా సాగాయి. వివిధ రకాల పండుగ సామానులు కొనుగోలు చేసేందుకు ప్రజలు మార్కెట్‌కు తరలిరావడంతో వ్యాపార సముదాయాలు కోలాహలంగా మారాయి.

మార్కెట్‌లోపతంగుల విక్రయాలు జోరందుకున్నాయి. కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది. చిన్నపిల్లలు సరదాగా ఆడుకునే పతంగుల నుంచి మొదలుకొని పెద్దవారు పందేలు వేసుకునే వరకు వివిధ రకాల పతంగులు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. జైపూర్, పూణే నుంచి వచ్చిన పేపర్, క్లాత్‌తో తయారు చేసినవి గాలిపటాలు ఒక్కోటి రూ.10 నుంచి మొదలుకొని రూ.120, – రూ.350 ధరలతో మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు. ఇవి యువతను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

రకరకాల దారాలు..

గాలి పటాలను ఎగురవేసేందుకు రకరకాల దారాలు అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. దారాలను చుట్టుకునేందుకు స్టీల్ చెరుకు, చెక్కతో చేసిన చెరుకులను రూ.50, రూ.250, రూ.350లకు అమ్ముతున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి పతంగులు, రంగురంగుల దారాలను తీసుకొచ్చి కొత్తగూడెం పట్టణంలో అమ్మకాలు సాగిస్తున్నారు. పతంగులతో పోటీలు పెట్టుకునేందుకు యువత సిద్ధమయ్యారు.

గాలి పటాలకు గిరాకీ..



సంక్రాంతి పండుగ సందర్భంగా గాలి పటాలకు గిరాకీ పెరిగింది. రకరకాల డిజైన్లు, రంగురంగులతో చిన్నవి, పెద్దవి అమ్ముడు పోతున్నాయి. గత ఏడాది రూ.4 లక్షలకు పైగా సరుకు అమ్మకాలు జరిపాం. ఈసారి ఇంకా ఎక్కువగా అమ్ముతాం. జైపూర్, పూణేల నుంచి పతంగులు తెప్పించి అమ్ముతున్నాం.

– సంజయ్‌సాహూ, గాలిపటాల వ్యాపారి, పెద్దబజార్

కంటి వెలుగును విజయవంతం చేయండి

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమం రెండో విడత అమలు కోసం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈ పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు, మందులు, శస్త్రచికిత్సలు కూడా చేసి ప్రజలకు అంధత్వ నివారణకు ప్రభుత్వం పాటుపడుతుందని తెలిపారు. 100 రోజుల పాటు సాగు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వార్డు స్థాయిలో కుర్చీలు, టెంట్లు, మంచినీటి సదుపాయం కల్పించాలని కౌన్సిలర్లను రొంపేడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవిత కోరారు. కార్యక్రమంలో కమిషనర్ అంకుషావళీ, డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్, కౌన్సిలర్లు, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు బ్రోచర్లు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

చుంచుపల్లి: ఈ నెల 18 నుంచి చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కంటివెలుగుపై సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. మండల పరిధిలో క్యాంపుల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కంటి వెలుగు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్

పాల్వంచ: పట్టణంలోని ఆదర్శ స్కూల్‌లో ఈనెల 14వ తేదీన ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు నవోదయ ఉచిత మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నామని శ్రీలేఖ నవోదయ ఎంట్రన్స్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ఎం.హేమరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు పరీక్ష నిర్వహిస్తామని, వివరాలకు 9618408892 నంబరులో సంప్రదించాలని కోరారు.

జూదం, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ వసంతకుమార్

జూలూరుపాడు: జూదం, కోడి పందేలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని, బహిరంగంగా మద్యం సేవించి శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పండుగ సందర్భంగా ఊళ్లకు వెళ్లేవారు ఇరుగు పొరుగు వారికి స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, అనుమానితులు, అపరచిత వ్యక్తులు కన్పిస్తే తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వడంతోపాటు, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి



తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా స్థానిక సొసైటీ కార్యాలయం నుంచి వందలాది మంది ఆ పార్టీ కార్యకర్తలు, నిరుపేదలతో ప్రారంభమైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికలక ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. నిరుపేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పిన సీఎం నూటికి పది మందికి ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.3 లక్షలు ఇస్తామన్న హామీ ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ఇంటి స్థలం లేనివారికి స్థలం ఇవ్వడంతోపాటు అర్హులైన పేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకం మంజూరైతే దళారీలు పర్సంటేజీలు అడుగుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లూథర్ విలన్స్‌కు అందజేశారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, ఎం.కృష్ణయ్య, కుమారి, సుశీల, వెంకటమ్మ, పుష్ప, తెల్లం రాజేష్, కల్తి సురేష్, వర్సా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షించాలి



బహుమతులు అందజేస్తున్న దృశ్యం


ఇల్లెందురూరల్: అడవుల పరిరక్షణ, పునరుద్ధరణలో యువత భాగస్వాములు కావాలని సీసీఎఫ్ డి.భీమ్, డీఎఫ్ఓ లక్ష్మణ్ రంజిత్ నాయక్ పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో మృతి చెందిన ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ స్మారకార్థం అటవీశాఖ ఇల్లెందు డివిజన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం పోలంపల్లి, సుదిమళ్ల జట్ల మధ్య హోరాహోరీ పోరులో పోలంపల్లి జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు నగదు, జ్ఞాపికను అందజేశారు. ఎఫ్‌డీఓ నీరజ్‌కుమార్, రేంజ్ అధికారులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, దీపిక, మురళి, డీఆర్ఓ రాంసింగ్, సాల్మన్ పాల్గొన్నారు.

యాసిడ్ దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు

కొత్తగూడెంటౌన్: మహిళలపై యాసిడ్‌దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, మహిళలు యాసిడ్ దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం మూడో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏ.నీరజ అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఎదురుగా న్యాక్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్జి ఏ.నీరజ పాల్గొని మాట్లాడారు. యాసిడ్ దాడులకు పాల్పడితే గరిష్టంగా 10 ఏళ్లు.. దాడికి యత్నిస్తే ఐదేళ్ల జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. మహిళలు స్వశక్తితో ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. యాసిడ్ దాడి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని, నేరం జరుగకముందే జాగ్రత్తపడాలని ఆకతాయిల పట్ల అనుమానం ఉంటే షీటీంకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్కినేని సత్యనారాయణ, జిల్లా లీగల్ సర్వీసెస్ సభ్యుడు ఎండీ సాధిక్‌పాషా, తోట మల్లేశ్వరరావు, మెండు రాజమల్లు, ఎస్వీ రాజేష్, న్యాక్ సెంటర్ ట్రైనర్ బేబీ పాల్గొన్నారు.

లైజన్ సెల్ ఏర్పాటు చేయండి

టేకులపల్లి: ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్‌కు ఒకటే రోస్టర్ రిజిష్టర్ నిర్వహించడం వల్ల ఆ సైకిల్‌లో వచ్చిన పోస్టు ఎందులో ఉందో తెలుసుకోవడం ఇబ్బందిగా ఉంటుందని విడివిడిగా రోస్టర్ రిజిష్టర్లు ఏర్పాటు చేయాలని కేటీసీ ఉద్యోగి, సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా నాగేశ్వరరావు కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌రావు, చీఫ్ లైసన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ భూక్యా వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ రాంసింగ్, అనిల్‌తో సెంట్రల్ కమిటీ బృందం శుక్రవారం సింగరేణి డైరెక్టర్(పా) చంద్రశేఖర్, జనరల్ మేనేజర్లు బసవయ్య, ఆనందరావులను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేషనల్ కమిషన్ సభ్యుడు అనంత నాయక్ వచ్చిన సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన రివ్యూలో సింగరేణి లైజన్ సెల్‌ను ఏర్పాటు చేస్తామని యాజమాన్యం అంగీకారం తెలిపిన విధంగా ఆ లైజన్ సెల్‌ను వెంటనే ఏర్పాటు చేసి గిరిజన ఉద్యోగులకు, గిరిజనులకు సేవలందించాలని విజ్ఞప్తి చేశారు.



డైరెక్టర్(పా) చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతుల సంక్షేమమే లక్ష్యం

టేకులపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా డీసీసీబీ అవిశ్రాంతంగా కృషి చేస్తోందని ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బేతంపూడి సొసైటీ కార్యాలయాన్ని సందర్శించారు. మాట్లాడుతూ.. డీసీసీబీ, సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో చెల్లింపులు చేసి రుణ పరపతి పొందాలని తెలిపారు. బేతంపూడి సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తున్న చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, సిబ్బందిని అభినందించారు.

సీఎం పర్యటనతో నెరవేరిన కల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముఖ్యమంత్రి నియోజకవర్గానికి వరాలజల్లు కురిపించి అభివృద్ధి పనులకు రూ.250 కోట్లు మంజూరు చేయడంతో నాకల నెరవేరిందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ముర్రేడు వాగు వల్ల తరచూ పలువురు ఇళ్లు కోల్పోతున్నారని సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే రిటర్నింగ్ వాల్ నిర్మించడానికి రూ.150 కోట్ల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలో హైదరాబాద్ నుంచి ఇరిగేషన్ అధికారులు వచ్చి సర్వే చేస్తారని చెప్పారు. కొత్తగూడెం , పాల్వంచ మున్సిపాలిటీలకు రూ.40 కోట్ల చొప్పున కోట్లు కేటాయిస్తున్నారని, జంట నగరాలుగా తీర్చి దిద్దుతామన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని 103 పంచాయతీలకు అభివృద్ధి పనుల నిమిత్తం రూ.10లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఎస్టీ, మాయాబజార్, మేదరబస్తీ రైల్వే నిర్వాసితులకు, పాత్రికేయులకు, ముర్రేడు వరదల వల్ల ఇళ్లు కోల్పోయిన వారికి సింగరేణి ప్రధాన కార్యాలయం పక్కన ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

దివ్యోత్సవం పోస్టర్లు ఆవిష్కరణ

తెలంగాణ విభిన్న ప్రతిభా వంతుల సంఘం (టీవీపీఎస్) ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలుగా ఘనంగా నిర్వహిస్తున్న దివ్యోత్సవం (దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం) ఈనెల 29న కొత్తగూడెం క్లబ్ వేదికగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చేతుల మీదుగా క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరింపజేశారు. బాదావత్ శాంతి, కొట్టి వెంకటేశ్వర్లు, యాకూబ్, గుండపనేని సతీష్, మేడి ప్రవీణ్‌కుమార్, సున్నం కరుణాకర్, గోవిందు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనతో ఒరిగిందేమీ లేదు..



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదని ఎడవల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎడవల్లి కృష్ణ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ వస్తున్నారని కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం జరిగిందని, అక్రమంగా వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. మున్సిపాలిటీకి నిధులు ఉంటాయని, వాటికి ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు చెప్పడం ఏంటన్నారు. సీఎం సభలో తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులెవరూ లేకపోవడం శోచనీయం అన్నారు. మున్సిపాలిటీలో సర్వే నంబర్ 444, 817, 999లపై స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ ఎన్నికలు, పోడు పట్టాలు, కొత్తగూడెంలో పూర్తి స్థాయి యాజమాన్య హక్కులపై స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి బీఆర్ఎస్ తొలి సభను ఖమ్మంలో నిర్వహించాలనుకోవడం ఆ పార్టీ అభద్రతా భావానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, బీఎస్ చారి, కొండం వెంకన్న, పైడిపల్లి మనోహర్, చంద్రగిరి సత్యనారాయణ, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతోనే సీఎం పర్యటన కొనసాగింది

చుంచుపల్లి: సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా జిల్లాతో పాటు ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ములుగు జిల్లా ఇన్‌చార్జ్ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన వల్ల కొత్తగూడెం పట్టణంలోని దుకాణాలన్నీ మూసివేయించడం ద్వారా వ్యాపార వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని విమర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన మొత్తం అరెస్టుల మధ్య కొనసాగిందని ప్రజా సమస్యలు విన్నవించేందుకు వచ్చే ఇతర పార్టీ నాయకులను అరెస్టులతో నియంత్రించారని ఆరోపించారు. బీజేపీ నాయకులను అరెస్టు చేసి ఇతర ప్రాంతాలకు తరలించటం సిగ్గుచేటన్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చే నిధులు నిలిపివేసి ఇప్పుడేదో కొత్తగా నిధులు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. యడ్లపల్లి శ్రీనివాస్, సీతారాం నాయక్, రాయుడు నాగేశ్వరరావు, రవీందర్, లక్ష్మణ్ అగర్వాల్ జోగు ప్రదీప్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ

సెల్ఫీ విత్ రంగోలి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐ సత్యనారాయణ

కొత్తగూడెంరూరల్: జీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సెల్ఫీ విత్ రంగోలి కార్యక్రమంలో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 15 వరకు ఇళ్ల ముందు వేసిన ముగ్గులను సెల్ఫీ తీసి 9000074646, 9000037676 నంబర్లకు పంపించి బంగారం గెలుచుకోండి అని సీఐ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పోస్టర్ల విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గంలోని అక్కచెల్లెమ్మలకు తమ ఇళ్ల ముందు వేసిన ముగ్గులను సెల్ఫీ తీసి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సాహినా, ట్రస్టు కోఆర్డినేటర్ మోదుగు జోగారావు, ట్రస్టు మేనేజర్ ప్రభాకర్, పీఆర్వో శివ, కిషోర్, రాంబాబు, నరేష్, లక్ష్మణ్, సుజాత, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వామపక్షాలు ఏకం కావాలి

సింగరేణి(కొత్తగూడెం): బీజేపీని ఓడించటానికి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఐక్యం కావాలని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. మంచికంటి భవన్‌లో జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ అధ్యక్షతన శుక్రవారం కేంద్రీకరించే నియోజకవర్గ బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత మత విద్వేశాలు రెచ్చగొడుతూ ప్రజలను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. బలమైన ప్రతిపక్షం లేకపోవటం వలనే బీజేపీ ఏకపక్షంగా దూకుడు పెంచిందన్నారు. రాజకీయాలంటే ఓట్లు, సీట్లు మాత్రమే కాదని ప్రజల బతుకు మార్చేవిధానం అవసరమని పేర్కొన్నారు. కానీ నేడు కొంతమంది ఈ సంప్రదాయాన్ని వదిలేసి తమ స్వార్థం కోసం మతోన్మాద రాజకీయాల వైపు ప్రయాణం చేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో కాసాని అయిలయ్య, అన్నవరపు కనకయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, భూక్యా రమేష్, వీర్ల రమేష్, కొండబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

పల్లె, పకృతిని ప్రేమించడమే సంక్రాంతి



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): పల్లెలను, ప్రకృతిని ప్రేమించడమే సంక్రాంతి పండుగ అని, పంటలు ఇంటికొచ్చే రైతన్నలకు కొండంత సంతోషాన్ని ఇచ్చే తెలిగింటి లోగిళ్ల పండుగ సంక్రాంతిని పల్లె వారసులమైన మనమందరం కలిసిమెలసి సంబురంగా జరుపుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత కొత్తగూడెం రామా టాకీస్ ఏరియా, బర్మా క్యాంపు, కూలీ లైన్, సీఆర్పీ క్యాంపు ఏరియాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు ఉల్లాసంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులతో వీధులు హరివిల్లును తలపించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ... నేటి ఆధునిక జీవన విధానంతో తెరమరుగవుతున్న సంస్కృతి సంప్రదాయాలను పండుగల రూపంలో బతికించుకుంటూ భావితరాలకు అందిస్తున్నామని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా మాట్లాడుతూ.. మహిళలు సమాజపోకడలపై అవగాహన పెంచుకొని నడుచుకోవాలని, మహిళా రక్షణ చట్టాల అమలు, ప్రభుత్వ హామీల సాధన కోసం ఉద్యమాలకు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే.చంద్రకళ, మున్నా లక్ష్మీకుమారి, శ్రీనివాస్‌రెడ్డి, సలిగంటి శ్రీనివాస్, కే.రత్నకుమారి, ఎల్.సుగుణ, ధనలక్ష్మి, షాహిన్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.